చిత్ర సకుటుంబ సచిత్ర మాసపత్రిక, జూన్ 2009

# స్పర్శ

కిటికీలో నుంచి బయటికి చూస్తోంది రాజమ్మ. ఇంటి బయట ఖాళీ స్థలంలో షామియానా వేయించారు. దాని కిందనే జరుగుతోంది కర్మకాండ. ఊళ్ళో పరిచయస్థులు, బంధువులు, అంతా కుర్చీల్లో కూర్చుని ఉన్నారు. పెద్ద బలగమే. అనివార్యమైన సంఘటన జరిగిపోయింది. వెంకటప్పయ్య చనిపోయి ఇవ్వాళ్టికి పన్నెండు. భర్త భారీ శరీరం - ఇంకా పక్కన మంచంలో వున్నట్టే ఉంది రాజమ్మకి.

దానాలు ఇస్తున్నారు. పెద్దవాడు నారాయణ చేతిమీదుగా జరగుతున్నాయి. అతని పక్కగా సుందరం, కృష్ణమూర్తి - తమ్ముళ్ళు. రాజమ్మ నాలుగో కొడుకు విశ్వం అమెరికాలో వున్నాడు, రాలేదు. అతనూ, అతని భార్య కూడా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు.

షామియానా క్రింద హడావిడిగా వుంది. డబ్బు ఆధ్వర్యం - రెండో అల్లుడు మురళిది. నోట్ల కట్టలు పట్టుకుని ఒక్కొక్క దానానికీ ఇంతింత అని అందజేస్తున్నాడు.

తిలదానం పట్టవలసిన బ్రాహ్మడు రాలేదు. నలుగురూ నాలుగు మాటలు మాట్లాడుతున్నారు. తిట్లపురాణం మొదలెట్టాడు కర్మ చేయిస్తున్న పంతులు. ఎవరో స్కూటర్ మీద పరిగెత్తారు. విరామంలో కాఫీలు మొదలైనాయి.

కొడుకుల్ని చూస్తుంటే రాజమ్మ చెంపల మీదుగా కన్నీరు జారింది. గుండె పొరలు జ్ఞాపకాల ఊటని పొంగించినాయి.

నారాయణ ఇంటికి వచ్చి రెండేళ్ల పైమాటే. ఏడాది క్రితం తండ్రికి పక్షవాతమొస్తే – ఆనవాయితీ మాటతో సరిపెట్టేశాడు. "వచ్చీపోయే దూరమా అమ్మా. ఎక్కడ బరోడా, ఎక్కడ విజయవాడ?" అని. ఆ తర్వాత ఆర్నెల్లకో రోజున వచ్చి, చెప్పుల్లో కాళ్ళు పెట్టుకొని మర్నాడు వెళ్ళిపోయాడు. హైదరాబాద్‌లో అత్తగారింట్లో నాలుగు రోజులుండి వ్యవహారాలు చూసుకుని పోయాడు! సుందరమూ, భార్య జానకీ వైజాగ్ నుంచి వచ్చి నాలుగు రోజులుండి వెళ్ళారు. "నా అవస్థలు మీకు తెలీనివి కావు. నోటికీ చేతికీ సంపాదన. ముగ్గురూ ఆడపిల్లలు" అని తన బాధ చెప్పుకున్నాడు. వెళ్ళే రోజున తగినంత ముట్టచెప్పాడు తండ్రి. తానేమో ముగ్గురు మనవరాళ్ళకీ డ్రెస్‌లనీ, పూసలనీ, గాజులనీ ఏదో తోచినవి కొనిచ్చింది. కృష్ణమూర్తీ అతని భార్య సురేఖ ఢిల్లీ నుంచీ ఫోన్‌లో శుష్కహస్తాలూ, శూన్యప్రియాల్తో సరిపెట్టారు. మంచివైద్యం చేయించమనే ఆందోళనని బాగానే వ్యక్తం చేశారు. ఇద్దరూ గవర్నమెంట్‌లో ఆఫీసర్లు.

దానాలూ, ధర్మాల పని ముగిసినట్లుంది. భూదానం, ధాన్యదానం, సువర్ణదానం, రజతదానం వంటి ముఖ్యమైన ఐటమ్స్‌ని అటూ ఇటూ వారు తమలో తామే సర్దుకున్నారు. కొడుకులూ, ఇద్దరు అల్లుళ్ళూ మొహాలు ప్రసన్నంగా ఉన్నాయి.

రాజమ్మకి నవ్వొచ్చింది. ఎవ్వరూ ఈ పన్నెండు రోజుల్లోనూ చిల్లిగవ్వ బయటికి తీయలేదు. సొమ్మొకరిది అన్నట్టు దానధర్మాల్లో పెద్ద చెయ్యి చూపారు. ఊళ్ళో పెద్దలంతా వెంకటప్పయ్య అదృష్టవంతుడన్నారు. కొడుకులు అన్నీ భారీగా జరిపారని మెచ్చుకున్నారు. చెక్కుల మీద సంతకాలు మాత్రం రాజమ్మవే చెల్లినాయి.

బ్రాహ్మలు భోజనాలు చేస్తున్నారని కబురు తెచ్చింది – రాజమ్మ పెద్ద కోడలు సుగుణ. కుర్చీ దిగి ఒక మూలగా గోడకానుకుని కూర్చుంది రాజమ్మ. మాసిన చీరలో ఉండిపోయింది. ఊళ్ళోవాళ్ళూ, బంధువుల్లో పదోరోజున మొహం చూడనివారూ – గదిలోకి హాల్లోనుంచీ వచ్చి వేరే గుమ్మంలోంచీ బయటికి వెళ్తున్నారు.

అరమోడ్పు కళ్ళతో గోడకి జారిగిలపడింది రాజమ్మ. గతం బొమ్మలు ఎదురు గోడమీద కదలాడాయి.

ఏ యాభై అయిదేళ్ళ క్రితమో వచ్చింది యింటికి. అప్పటికి తన వయస్సు పదిహేను. ఆయనకి ముప్పై. అప్పటికే ఆయనకిద్దరు పిల్లలు. భార్య పోయింది. పిల్లల్దిరూ మగవాళ్ళే. లొట్టికాయల్లా ఐదూ మూడూ వయస్సు వాళ్ళు. ఆ తర్వాత తనకు ఇద్దరు మగపిల్లలూ, ఇద్దరు ఆడపిల్లలూ, ఆరుగురూ ఒక్క తల్లి పిల్లల్లాగానే పెరిగారు. వాళ్ళ మధ్య ఏ పొరపొచ్చాలూ రాలేదు. కూడలి కొమ్మల్లా కలిసిపోయారు. తన పెంపకంలోనే ఉందా ఘనత అనేవాళ్ళు – తెలిసినవాళ్ళంతా. ఉన్నంతలో అందరికీ పెళ్ళిళ్ళూ, పేరంటాలూ బాగానే జరిపారు. కూతుళ్ళిద్దరికీ రత్నకీ, రాణికీ – కూడా మంచి సంబంధాలే తెచ్చారు. వెంకటప్పయ్య మంచి ఉద్యోగమే చేశాడు. ఆయన రిటైరైనప్పుడు వచ్చిన సొమ్ములో నుంచీ తాననుకున్నది ఆరుగురు పిల్లలకీ తలా కాస్తా ఇచ్చేసి, “మా నుంచి ఇంకేమీ ఆశించకండి. ఇచ్చిన దాంతో ఏం చేసుకున్నా సరే మీ యిష్టం. మా బతుకు మేం బతుకుతాం. నందో రాజా భవిష్యతి” అని చెప్పేశారు.

కాలం దీర్ఘంగానే గడిచింది. మరీ ఆయనకి పక్షవాతం వచ్చి మంచాన పడినప్పట్నుంచీ చేదోడు వాదోడంతా తన చెల్లెలి కూతురు చిన్నమ్మే. ఆమె ఈ ఊళ్ళోనే ఉంటుంది. చిన్నప్పుడే భర్తపోతే – ఒక్కగానొక్క కూతుర్ని – తన కుట్టుమిషన్ సంపాదనతోనే పెంచి పెద్దచేసి, పెళ్ళిచేసి పంపించింది. కూతవేటు దూరంలో ఆమె ఇల్లు. “పండుపండి రాలినట్లు పోయాడు. వెంకటప్పయ్య అదృష్టవంతుడు అంటున్నారు అందరూ. అవును ఆయన అదృష్టవంతుడే. ఇందరూ వుండి... తనకే ఇవ్వాళ ఇలా మిగిలిన అన్ని ఆలోచనలూ – అనిపించింది రాజమ్మకి. కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

నాలుగున్నరయింది. గ్లాసుతో మజ్జిగ తెచ్చిచ్చింది చిన్నమ్మ “అందరూ అయ్యారు. కాస్సేపు నడుంవాల్చు పెద్దమ్మా” అన్నది. మజ్జిగ తాగి అక్కడే నేలమీద పడుకుంది రాజమ్మ. కళ్ళు మూసుకున్నా గడచిన నాలుగు రోజుల సంభవాలే ఆమె మనోయవనిక మీద బొమ్మలై నిలుస్తున్నాయి.

వెంకటయ్య మిగిల్చిపోయిన డబ్బూదస్కం గురించిన చర్చ. రాజమ్మని ఏం చెయ్యాలీ, ఎవరు తీసుకుపోవాలీ అనే రచ్చ; దానధర్మాలూ కర్మకాండ ఖర్చులు గురించిన వాదోపవాదాలు – ముగ్గురు కొడుకులూ, ఇద్దరు కూతుళ్ళూ, దంపతి సమేతంగా రాత్రి ఒంటిగంట వరకూ రభస. అన్నీ హాల్లో బహిరంగంగానే జరిగినాయి.

ఏ సమస్య గురించీ ఏకాభిప్రాయం కుదరలేదు. పరస్పర నిష్ఠూరాలూ, దెప్పి పొడుపులే మిగిలాయి. అరుపులూ, కేకలూ, ఆడవాళ్ళు ముక్కు చీదుకోవటాలూ,

మగవాళ్లు పళ్లు కొరుక్కోవటాలూ - ఉచిత వినోద ప్రదర్శనమయింది. ఒకసారి పెద్దకోడలూ, మరోసారి సుందరమూ రాజమ్మ దగ్గరగా చేరి ఆమె అభిప్రాయం అడగాలని ప్రయత్నించారు. కానీ, తాను ఉలుకూ పలుకూ లేకుండా కూచుంది. రత్నా, రాణీ వచ్చి ఏవేవో ఇచ్చకాలు ముచ్చటించారు. వాళ్ళతోనూ, అందరూ వినేటట్లూ చెప్పింది తాను. "నాకే వ్యవహారాలూ తెలీవు. ఉన్నదంతా జాయింట్ పేర్ల మీద పెట్టున్నాను. సంతకమన్నా నేర్చుకోమని నా పేరు నేను రాయటం నేర్పారు. ముందీ కర్మకాండ కానీయండి. ఇంతవరకూ ఖర్చుకి సిద్ధం చేసే పోయారు కదా! ఎవరికీ ఏ బాధా లేకుండా" అని మాటలు త్రుంచేసింది.

వాళ్ళు మౌనంగా బయటికి నడిచారు.

మగపిల్లలకి ఇల్లు అమ్మించాలనీ, ఉన్న డబ్బు నలుగురూ పంచుకోవాలనీ ఆరాటం. ఆనక అమ్మని తలా నాలుగు నెలలూ ఉంచుకుంటే గడిచిపోతుందని భావన. మళ్ళీ దానికి అందరూ మనస్ఫూర్తిగా సిద్ధంగా లేరు. పీతకష్టాలు పీతవి. ఎవరికి వారు తప్పించుకోవాలనే....

ఆడపిల్లలకి బంగారం మీద ఆశ. ఇదే సమయమని కాచుక్కూచున్నారు. ఎంతలేదన్నా చెరో మూడు లక్షలూ దక్కుతాయని ఎదురుచూస్తున్నారు.

నిన్నరాత్రి ఇద్దరూ వచ్చి పక్కన కూర్చుని బంగారం ప్రసక్తి తెచ్చారు. చుర్రుమంది తనకు. తమాయించుకుంది. "చూద్దాంలెండే. నేనేమైనా నాతో కట్టుకుపోతానా యేం" అన్నది. ఇద్దరూ నీళ్ళు నములుతూ "ఏవోనే. అదీ తమకే కావాలని కూచుంటే నీ కొడుకులు?" అన్నారు. నిర్వికారంగా వాళ్ళ వైపు చూసింది. ఏమనుకున్నారో ఏమో మాట పొడిగించలేదు వాళ్ళిద్దరూ! కొద్దిసేపటి తర్వాత నిమ్మళంగా హాల్లోకి వెళ్ళిపోయారు.

సాయంత్రం ఐదయింది.

చిన్నమ్మ లోపలికొచ్చింది. "నేనోసారి ఇంటికి పోయొస్తా పెద్దమ్మా" అని చెప్పి వెళ్ళింది.

ఊరివాళ్ళూ, ఇతర ముఖ్యులూ ముందు బంతుల్లో భోజనాలకి కూర్చున్నారు. ఆ వడ్డనల సవ్వడంతా తెలుస్తోంది రాజమ్మకి.

ఐదున్నర దాటింది కొన్ని వరసలు లేచినట్లుంది. షామియానా క్రింద మళ్ళీ హడావిడి మొదలైంది. ఎవరో పండితులు నలుగురైదుగురు వచ్చి కూర్చున్నారు.

సూర్యాస్తమయానికి ముందే ఆశీర్వచనానికి కూర్చోవాలి రమ్మని అరుస్తున్నాడు పంతులుగారు. భోజనాలు కాకుండా కూచోవచ్చా అనే మీమాంస లేచింది. తప్పులేదని తీర్మానించారు చివరికి. నారాయణా సుగుణా పీటల మీద కూచుని ఉన్నారు. ఆ కార్యక్రమం అయింది. కోడలు తరఫు పుట్టింటివారెవరూ రాలేదు. ఆశీర్వచనం బట్టలు కూడా రాజమ్మ ఖర్చే అయిపోయింది. ఇవీ సంబంధాలూ, బాంధవ్యాలూ అనిపించింది రాజమ్మకి. వచ్చిన వేద పండితులు ఏదో వో పనస చదివారు. ఎవరో ఓ పెద్దాయన వేదాంతం మాటలు నాలుగు మాట్లాడాడు. రాజమ్మ శేషజీవితం గురించిన ప్రసక్తి రాకుండా వీళ్ళు జాగ్రత్తపడ్డారో, నిజంగానే ఎవరికీ తట్టలేదో కానీ, ఆ సంబంధమైన మాటల్లేకుండానే ఆ కార్యక్రమం ముగిసింది.

ఏడున్నర దాటింది.

పక్క హాల్లో ఇంట్లో మిగిలినవారు – అప్పటివరకూ భోజనం చేయనివారు – భోజనాలకి కూచున్నారు. కొందరు బంధువులు – ఆచారం అంతే అనుకుంటూ – ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయారు.

భోజనాలయ్యేసరికి ఎనిమిదీ ఎనిమ్మిదన్నర దాటింది. రత్నని పిలిచింది రాజమ్మ. ఆమె రాలేదు. రాణిని కేకేసింది. ఆమెకి వినిపించలేదు. సుగుణ కోసం గొంతు పెకల్చుకుని అరిచింది. ఆమె వినిపించుకోలేదు. జానకీ, సురేఖా.... ఎక్కడో ఉన్నారు.

ఈ గదివైపు ఎవ్వరూ చూడటం లేదు.

రాజమ్మకి గుండె మండుతోంది. కడుపులో ఆకలి. సంతానం ప్రవర్తనలో కలిసి పాతజ్ఞాపకాలు వెలుగునీడల్ని చూపుతున్నాయి. ప్రాణం కళ్ళల్లో కొస్తోంది. నిన్న సాయంత్రం ఇంత ముద్ద పెట్టారెవరో. పీకెండిపోయి ఆ ముద్దా సరిగా ఎక్కలేదు. అయిందనిపించి ఇన్ని మజ్జిగ నీళ్లు తాగింది. అవీ పులుపెక్కిపోయినాయి. ఇవ్వాళ పగలంతా రెండు మూడు సార్లు కాఫీ నీళ్ళిచ్చారు అంతే. ఇందాక తాను ఇంటికి వెళ్తూ చిన్నమ్మ ఇచ్చిన మజ్జిగే. కళ్ళు తేలిపోతున్నాయి. ఇదీ అని చెప్పుకోలేని బాధ. పక్కనే వున్న చెంబు ఎత్తుకుని నీళ్ళు తాగింది. పేగులు గుడగుడ శబ్దం చేసినాయి. కడుపులో కాళ్ళెట్టుకుని పడుకుంది.

ఇంతమంది జనం! తన మంచీ చెడూ ఎవరికీ పట్టలేదు. అసలు ఆకలికి తోడు ఈ బాధ మనసుని రగిలిస్తోంది.

ఆలోచనల్లోనే వచ్చింది చిన్నమ్మ.

వచ్చీ రావటమే రాజమ్మ దగ్గరగా వచ్చి కూర్చుంది. "ఏమన్నా తిన్నావా పెద్దమ్మా?" అడిగింది.

చూపే సమాధానమైంది.

చిన్నమ్మ గుండె గుబగుబలాడింది. సానునయంగా రాజమ్మ భుజం నిమిరి, కళ్ళు తుడిచి, ఒక్క ఉదటున వంటింట్లోకి పరిగెత్తింది. క్షణాల్లో గిన్నెలో ఇంత మజ్జిగన్నంతో తిరిగి గదిలోకొచ్చింది. అన్నరసాన్ని పిండి పెద్దమ్మ చేత నిదానంగా తాగించింది. ప్రేమా, ఆప్యాయతా, అమృతం తాగుతున్నట్టనిపించింది రాజమ్మకి. చిన్నమ్మ మంచినీళ్ళిచ్చింది. తాగింది రాజమ్మ. నీళ్ళు నిండిన కళ్ళతో చూసింది. మాట పెగల్చుకుని నిమ్మళంగా అన్నది రాజమ్మ, "చిన్నమ్మా - నువ్వు నిజంగా నా అమ్మవే!" అని.

ప్రక్క హాల్లో - భాగహారాల లెక్కల మీద వాదోపవాదాలు సాగుతూనే వున్నాయి.

రాజమ్మ ను అన్ని అవసరాల నుంచి విముక్తురాలయి పోయినట్టనిపించింది! చిన్నమ్మ వైపు తృప్తిగా చూసింది.

కిటికీలో నుంచీ చల్లటిగాలి వీస్తోంది!!